క్లుప్తంగా

నేడు విగ్రహాల ఆవిష్కరణ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని కొండేరులో సోమవారం డా.బీఆర్‌ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌ రావు విగ్రహాలను ఆవిష్కరిస్తున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌ రెడ్డి, ఢిల్లీలో ప్రభుత్వ ప్రత్యేక అధికార ప్రతినిధి మందా జగన్నాథం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్‌ సరిత హాజరవుతారని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ యూత్‌ అధ్యక్షుడు రాజీనామా

ఎర్రవల్లి చౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి సర్పంచ్‌ జోగుల రవి అలంపూర్‌ నియోజక వర్గ కాంగ్రెస్‌ యూత్‌ అధ్యక్ష పదవికి ఆదివారం రాజీనామా చేశారు. ఫ్యాక్స్‌ ద్వారా జిల్లా అధ్యక్షుడు దీపక్‌ ప్రజ్ఞాకు పంపించారు.

బియ్యం పట్టివేత

గద్వాల క్రైం: పట్టణ శివారులో అక్రమంగా బియ్యం తరలిస్తున్న వాహనాన్ని ఆదివారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రామస్వామి తెలిపిన వివరాల ప్రకారం ఏడు క్వింటాళ్ల రేషన్‌ బియ్యం గూడ్స్‌ వాహనంలో తరలిస్తున్నారు. సమాచారం మేరకు వాహనాన్ని పట్టుకొని తనిఖీ చేయగా అందులో రేషన్‌ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ రెడ్యానాయక్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట

గద్వాల్‌ క్రైం: కేటిదొడ్డి మండలం పాతపాలెం గ్రామానికి చెందిన కమ్మరి లక్ష్మి, తిరుమలేష్‌ నాయుడులు ప్రేమ వివాహం చేసుకున్నారు. ఇరువురి కుటుంబ సభ్యుల నుంచి బెదిరింపు కాల్స్‌ వస్తున్నాయని ఆదివారం జిల్లా ఎస్పీ సృజనను వారు కలిసి కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దీంతో స్పందించిన ఎస్పీ వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్‌ నిర్వహించారు. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్‌ శాఖ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

పాత వస్తువులను అప్పగించండి

ఆత్మకూర్: మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలు తమ వద్దనున్న పాతవస్తువులు, పాత దుస్తులు, పాదరక్షలు, బుక్కులు, న్యూస్‌పేపర్లు అప్పగించాలని మున్సిపల్‌ వైస్‌చైర్మన్‌ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్‌ నాగరాజు, కౌన్సిలర్లు పిలుపునిచ్చారు. ఆదివారం ప్రభుత్వం ఆదేశాలమేరకు ఆర్‌ఆర్‌ఆర్‌ కార్యక్రమంలో భాగంగా 10 వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి పాత వస్తువులను సేకరించారు. పాతసామాన్లు అప్పగించిన వారికి ప్రశంసాపత్రాలను అందజేస్తామని పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి, పరిశుభ్రతకు ఆయా వార్డుల ప్రజలు సహకరించాలని కోరారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



అమరచింత: మండలంలోని మస్తీపురంలో పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. మండల ప్రధాన పశు వైద్యశాలకు అనుసంధానంగా ఉన్న సబ్‌ సెంటర్‌ కొన్నేళ్లుగా మరుగునపడింది. ఆస్పత్రి ఆలనా పాలనా చూసుకోవడానికి కాంపౌండర్‌ సైతం నియమించకపోవడం డిప్యూటేషన్‌పై పశుసిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడి సబ్‌ సెంటర్‌ నిరుపయోగంగా మారింది. అధికారులు స్పందించి ఆస్పత్రికి మరమ్మతు చేసి, పశు వైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

యూనియన్‌ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

వనపర్తి: రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్‌ యూనియన్‌-327 రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన చీర్లయాదిసాగర్‌ ఎన్నికయ్యారు. ఆదివారం వరంగల్‌ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ఎన్నికల్లో ఆయనకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా యూనియన్‌ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

అకాలవర్షంతో అస్తవ్యస్తం



మదనాపురం: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వీచాయి. కొత్తకోటకు వెళ్లే రహదారిపై చెట్లు నేలకొరిగిగాయి. రోడ్డుపై కొంత సమయం ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

మొక్కజొన్న తరలింపు

- సాక్షి కథనానికి స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శాంతినగర్: మొక్కజొన్నలను గోదాములకు తరలించకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని 'తూకం చేసినా కష్టాలే' శీర్షికతో వార్త శనివారం ప్రచురితమైంది. ఈ కథనానికి అధికారులు స్పందించారు. రెండు రోజుల్లో మొత్తం ధాన్యాన్ని తరలిస్తామని జోగుళాంబగద్వాల జిల్లా మార్క్‌ఫెడ్‌ అధికారి భాస్కర్‌రెడ్డి హామీ ఇచ్చి ధాన్యం తరలింపు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శనివారం 3 లారీల్లో ధాన్యం బస్తాలు తరలించారు. ఆదివారం సెలవుదినం అయినప్పటికి 15 లారీల్లో బస్తాల తరలించారు. సోమవారం మరో 15 నుంచి 20 లారీలు పంపి మంగళవారం వరకు కాంటా చేసినా మొత్తం ధాన్యాన్ని గోదాములకు తరలిస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 16 వ తేదీ వరకు మొక్కజొన్న ధాన్యం గోదాములకు తరలించిన రైతులకు ఈనెల 22వ తేదీన డబ్బులు జమ చేస్తామని వివరించారు. 16 నుంచి 23 వరకు కాంటా పట్టిన మొత్తం ధాన్యాన్ని గోదాములకు తరలించి వారం లోపు రైతుల డబ్బులు అకౌంట్లలో వేసేందుకు కృషిచేస్తానని జిల్లా అధికారి భరోసా ఇచ్చారు. రాజోళి మండలంలోని రెండు కొనుగోలు కేంద్రాల్లో కాంటాపట్టిన మొక్కజొన్నలు తరలించామన్నారు.

నేటి నుంచి కొనుగోళ్లు..

జూలెకల్, శాంతినగర్ కొనుగోలు కేంద్రాల్లో తూకం చేసిన ధాన్యం 8 వేల క్వింటాళ్లు (16 వేల బస్తాలు) గోదాములకు తరలించకపోవడంతో కొనుగోళ్లు నిలిపివేశారు. ఆదివారం వరకు 20 లారీల్లో ధాన్యం తరలించడంతో సోమవారం నుంచి రెండు సెంటర్లలో తిరిగి కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభిస్తామని అధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు.



జూలెకల్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం బస్తాలు లారీలో లోడ్ చేస్తున్న హమాలీలు

నిరుపయోగంగా పశువుల నీటితొట్లు

మల్దకల్: మండలంలోని అమరవాయి, బిజ్వారం, పెద్దొడ్డి, ఎద్దులగూడెం, గ్రామాల్లో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్లు నిరుపయోగంగా ఉన్నాయి. గతంలో నిర్మించిన నీటితొట్లు మూగజీవాలకు ఎంతగానో ఉపయోగపడేవని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం నీటితొట్లకు నల్లా కనెక్షన్‌లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు నిరుపయోగంగా ఉన్న నీటి తొట్లను వినియోగంలోకి తీసుకురావాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



అమరవాయిలో నిరుపయోగంగా ఉన్న నీటితొట్టి

ప్రమాదభరితంగా కల్వర్టు



మల్దకల్ నుంచి కుర్తిరావుల్‌చెర్వుకు వెళ్లే దారిలో ప్రమాదభరితంగా ఉన్న కల్వర్టు రక్షణ గోడ

మల్దకల్: మండలంలోని కుర్తిరావుల్‌చెర్వు, మల్దకల్ గ్రామాల మధ్య నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాలువపై ఏర్పాటు చేసిన కల్వర్టు రక్షణ గోడ కూలి ప్రమాదభరితంగా మారింది. మూడేళ్ల కిందట కూలిన రక్షణ గోడకు అధికారులు మరమ్మతు చేపట్టకపోవడంతో వాహన దారులు ప్రమాదాలబారిన పడే అవకాశం ఉంది. నిరంతరం కాలువల్లో నీరు ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన దారులు, ప్రయాణికులు భయందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిన కల్వర్టు రక్షణగోడకు మరమ్మతు చేపట్టాలని వాహన దారులు, ప్రజలు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్‌ నాయకుల మద్దతు

అయిజ: మేడికొండ గ్రామాన్ని నూతన మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష ఆదివారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ నాయకులు ఆర్ కిషోర్, మునిస్వామి, జీవన్, మహేష్, అశోక్, శ్రీను, అశోక్, యువరాజు, తరుణ్ దీక్ష శిబిరాన్ని చేరుకొని మద్దతు తెలిపారు. గ్రామస్తులు నిరాహార దీక్ష న్యాయబద్ధమైందని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న మేడికొండ గ్రామస్తులు

మట్టి రోడ్డుకు మరమ్మతు



అయిజలో రోడ్డుకు మరమ్మతు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది



గట్టులో మట్టిని చదును చేస్తున్న ఎంపీపీ విజయ్ కుమార్

అయిజ: మున్సిపాలిటీలోని 9వ వార్డులోని మైలోనిగడ్డ కాలనీలో మట్టిరోడ్డుకు ఏర్పడిన గుంతలు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు మున్సిపల్ సిబ్బందితో మరమ్మతు చేయించారు. జేసీబీ ద్వారా గుంతలను చదును చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడారు. మట్టిరోడ్డుకు తాత్కాలిక మరమ్మతు చేపట్టి త్వరలో సీసీ రోడ్డు, డ్రైయినేజీలు నిర్మిస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి తాగునీటి సరఫరా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గట్టు: మండల కేంద్రం- మాచర్ల రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఆదివారం పూడ్చారు. ఎంపీపీ విజయ్‌కుమార్ మరమ్మతు పనులను పర్యవేక్షించారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా పనులు చేస్తున్నట్లు ఎంపీపీ పేర్కొన్నారు. రాత్రి వేసిన మట్టిని డోజర్‌తో చదును చేయించారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

అయిజ: భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ కార్యదర్శి శ్లేషావలి ఆచారి అన్నారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, రవీందర్, లక్ష్మన్న, శివ, వెంకటేష్, సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి హాజరై రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటన్న, అంజి, ప్రభాకర్, వెంకటేష్, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

శాంతినగర్: దేశంలో ఐటీ రంగానికి పునాదులు వేసింది మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పాతబస్టాండు ఎదుట ఆదివారం రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వీరుబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఇసాక్, గట్టు గౌస్, షేక్ జమాల్, కిఫాయత్, కౌసర్ బేగ్, శివరాజ్, ఇలియాస్, విజయ్‌కుమార్, ఖాజా తదితరులు ఉన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి చిన్న ఆముదాలపాడు సర్పంచ్ నాగేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నయీం, మధు, రామిరెడ్డి, బాల్‌రాజు, హుస్సేన్, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.



శాంతినగర్‌లో నివాళులు అర్పిస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



అయిజలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎర్రవల్లి చౌరస్తాలో..

చదువులమ్మ చెట్టు నీడలో..

గద్వాల: జిల్లా కేంద్రంలోని గ్రేస్ కాన్వెంట్ రోసారీ హైస్కూల్‌లో 1997-98లో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. వృత్తులు, కుటుంబ నేపథ్యం, పిల్లల చదువులు, బాగోగుల గురించి పరస్పరం తెలుసుకున్నారు. వెంకటేష్ పట్వారీ, శరత్‌ఏక్బోటే, శ్రీకాంత్‌గౌడ్, నవీన్‌క్రాంతి, నరేందర్‌రెడ్డి, కృపాకర్, సీతారాంరెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

రోడ్డుపై గుంతలను పూడ్చాలి



ఎల్కూరు-మల్దకల్ గ్రామాల మధ్య రోడ్డుపై ఏర్పడిన గుంత

మల్దకల్ : మండలంలోని ఎల్కూరు- మల్దకల్ గ్రామాల మధ్యన బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు. పదేళ్ల కిందట వేసిన బీటీ రోడ్డు గుంతలమయంగా మారిందని వాహనదారులు వాపోయారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కాల్వల్లో పేరుకుపోయిన ముళ్లపొదలు



సింగపేట శివారులో ఎత్తిపోతల కాల్వ దుస్థితి

అమరచింత: అమరచింత ఎత్తిపోతల పథకం ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న సాగునీటి కాల్వల్లో ముళ్లపొదలు పేరుకుపోయి, సాగునీరు ముందుకు వెళ్లడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ఎత్తిపోతల పథకంలో భాగంగా మూలమళ్ల, మస్తీపురం, సింగపేట, ఖానాపురం, అమరచింత, పాంరెడ్డిపల్లెలో ఆయకట్టుకు కాల్వల ద్వారా సాగునీరు అందుతుంది. ప్రతి ఏడాది ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాల్వల్లో పెరిగిన ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేశారని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్లుగా పూడిక తీత పనులు చేపట్టడం లేదు. ఇప్పటికైనా లిఫ్ట్ ప్రారంభం కాకముందే ఉపాధి హామీ ద్వారా కాల్వలలో పూడిక తీత పనులను చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



అమరచింత శివారులో కాల్వ..

వృక్షాలకు రక్షణ కరువు

- చెట్లకు నిప్పు
- పట్టించుకోని అధికారులు

అయిజ: తెలంగాణలో అడవుల శాతం పెంచేందుకు ప్రభుత్వం హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటారు. రాయిచూర్ - కర్నూల్ రహదారికి నాటిన మొక్కలు వృక్షాలుగా మారాయి. అవి పెరిగి పెద్దవిగా మారి ఇప్పుడు బాటసారులకు చల్లని నీడనిస్తున్నాయి. కొన్ని రోజులనుంచి మున్సిపాలిటీ పరిధిలోని పర్దిపురం, వెంకటాపురంస్టేజి గ్రామాల మధ్య ఉన్న వివిధ రకాల చెట్లకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెడుతున్నారు. చెట్ల మొదలు వద్ద చెత్తాచెదారం వేసి నిప్పుపెడుతున్నా అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినపిస్తున్నాయి. దీంతో చెట్లు పూర్తిగా దెబ్బతిని ఎండిపోతున్నాయి. రక్షించాల్సిన అధికారులు పర్యవేక్షించకపోవడంతోనే దండగులు చెట్లకు నిప్పుపెడుతున్నారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంటపొలాల పక్కన చెట్లు ఉంటే పంట దిగుబడి రాదనే ఉద్దేశంతో కొంతమంది రైతులు వారి పంటపొలాల్లోని చెట్లను తగలబెడుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు.



చెట్టు మొదలువద్ద నిప్పుపెట్టిన ఆనవాళ్లు



కాలిన చెట్టు

నిప్పు పెడుతున్నారు..



రాయచూర్ - కర్నూలు రహదారి పక్కన ఉన్న పెద్ద పెద్ద చెట్లను కొంతమంది కావాలనే తగలబెడుతున్నారు. చెట్లు పంటపొలాల పక్కన ఉండడంతో పంటల దిగుబడి రావడంలేదని కొంతమంది రైతులు నిప్పుపెడుతున్నారు. దీంతో చెట్లు ఎండిపోతున్నాయి. బాటసారులకు నిలువనీడ లేకుండా పోతుంది.

– నాగరాజు, బింగుదొడ్డి

చర్యలు చేపడుతాం..



రోడ్ల పక్కన చెట్లను నరికివేసినా, నిప్పుపెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. కొంతమంది రైతులు రాయచూర్- కర్నూల్ రోడ్డు పక్కన చెట్లకు నిప్పుపెట్టి కాల్చివేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. విచారణ చేపట్టి చెట్లను నరికినవారిపై, చెట్లను కాల్చివేసిన వారిపై కేసులు నమోదుచేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– అబ్దుల్ వాజిద్, ఫారెస్ట్ ఆఫీసర్

ఎండలకు ఉక్కిరి బిక్కిరి

ఆత్మకూర్: మండుతున్న ఎండలు, వడగాలులతో జనం ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వడదెబ్బ తగిలి పలువురు అస్వస్థతకు గురవుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ ఎండకు నిర్మానుష్యంగా మారాయి. సాయంత్రం 6గంటల తర్వాతనే జనం ఇళ్లలోనుంచి బయటకు వస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచే ఎండలు తీవ్రస్థాయిలో ఉండడంతో ప్రజలు బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చల్లదనం కోసం కూల్‌డ్రింకులు, జ్యూస్, కొబ్బరి నీళ్లు, చెరుకురసం, పండ్లరసాలు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవసరముంటే తప్పా బయటకు రాకూడదని, అత్యవసర పరిస్థితిల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలని, తలకుటోపీ ధరించాలని, ద్రవ పదార్థాలు తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి వైద్యులు శబరి, నిస్సార్ అహ్మద్ సూచించారు.



పలువురికి అస్వస్థత

అధిక ఎండల కారణంగా మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 9మంది వడదెబ్బకు గురై పట్టణ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సైతం పదుల సంఖ్యలో వడదెబ్బ బాధితులు చికిత్స పొందుతున్నారు.

సంతకు సన్ ఎఫెక్ట్..

ఆదివారం పట్టణంలో నిర్వహించే సంతకు సుదూర ప్రాంతాల నుంచి జనం అధిక సంఖ్యలో వస్తుంటారు. ఎండలు అధికంగా ఉండడంతో జనం రాక గిరాకీ లేక కూరగాయల వ్యాపారులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.